క్లుప్తంగా

జీవన ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న ఏఓ శివరామ కృష్ణారెడ్డి

రాజుపాళెం : పంటలకు రసాయనిక ఎరువులతో పాటు జీవన ఎరువులను జత చేసి వాడినప్పుడే మొక్కలకు సంపూర్ణ పోషణను అందించవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎస్.శివరామ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని సీతారామ కల్యాణ మండపంలో ఎఫ్పీఓ, బయోఫ్యాక్టర్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సహదేవ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పంటలకు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నా అధిక దిగుబడి రాలేదని తెలిపారు. కార్యక్రమంలో బయోఫ్యాక్టర్ ఆర్ఎం వెంకటరాముడు, సొసైటీ డైరెక్టర్లు రెడ్డి సుబ్బిరెడ్డి, రంగారెడ్డి, లీలావలి, రైతులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం



ఆర్డీఓను సన్మానిస్తున్న బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలు ఇన్చార్జి ఆర్డీఓగా కొనసాగుతూ రెగ్యులర్ ఆర్డీఓగా నియమితులైన ఎ.చంద్రమోహన్ను సోమవారం బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ నాయకులు ఆర్డీఓ కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బద్వేలు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు, పార్క్, క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓను సన్మానించారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు కొండపల్లి చిన్నసుబ్బారావు, ప్రధాన కార్యదర్శి బి.గురుమూర్తి, కోశాధికారి వెంగలరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులను సత్కరించిన ఉపాధ్యాయులు

ఖాజీపేట : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది, గౌరవ ప్రదమైనదని మండల విద్యాశాఖ అధికారి స్వర్ణలత అన్నారు. మండలంలో వివిధ పాఠశాలల్లో పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులను సోమవారం ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగసానిపల్లె మెయిన్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పి. నారాయణ, సుబ్బన్న, పత్తూరులో ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బి. సరోజాదేవి అంకిత భావంతో విద్యార్థులకు బోధన చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 నాగరాజుతో పాటు స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్పై అవగాహన ర్యాలీ



మహాత్మాగాంధీ, తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థులు

చాపాడు: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్కు చెందిన విద్యార్థులు సోమవారం ప్రొద్దుటూరులో స్వచ్ఛ భారత్పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్గాంధీ సర్కిల్ నుంచి పట్టపర్తి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తెలుగు తల్లి, దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా

మైదుకూరు : ఇంటర్నేషనల్ తైక్వాండోలో మైదుకూరుకు చెందిన విద్యార్థులు పతకాలను సాధించారు. రెండు రోజుల కిందట గోవాలో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో పోటీల్లో మైదుకూరుకు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పోవరసే కటాస్ విభాగంలో ఇద్దరు రజత, ఐదుగురు వెండి పతకాలను సాధించారు. అదే విధంగా కొరియోగి విభాగంలో ఇద్దరు బంగారు, ఐదుగురు వెండి పతకాలు సాధించినట్లు మాస్టర్ జిలానీ బాషా ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచర్ల రుద్ర దీప్ (23) అనే యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై శ్రీ నగరం గ్రామం వద్ద రుద్రదీప్, మరో యువకుడు బైక్పై వెళ్తూ యూటర్న్ తీసుకుంటుండగా కర్నూలు వైపు నుంచి వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టినట్లు తెలుస్తోంది. సంఘటనలో రుద్రదీప్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు క్షేమంగా బయటపడ్డాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- రోజురోజుకు మితిమీరిపోతున్న భూకబ్జాలు



పి.పి.కుంటలో నిర్మించిన అక్రమ కట్టడాలు

గోపవరం : ఖాళీగా ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా వెంటనే గుడిసెలు వేయడం, అక్రమ కట్టడాలు కట్టడం పరిపాటిగా మారింది. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో రోజురోజుకు భూ ఆక్రమణలు మితిమీరిపోతున్నాయి. మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీ పి.పి.కుంట జాతీయ రహదారి పక్కనే గోపవరం రెవెన్యూ పొలం-2 సర్వే నంబర్ 1,562లో గతంలో జగనన్న కాలనీకి స్థలాన్ని కేటాయించారు. ఇళ్లు లేని నిరుపేదలు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా 70 మందికి పైగా గత ప్రభుత్వంలో పట్టాలు మంజూరయ్యాయి. ఇచ్చిన పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇంతలో కొందరు పేదలను రెచ్చగొట్టి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన స్థలంలో గుడిసెలు వేయించారు. వీరంతా స్థానికేతరులు. పట్టాలు పొందిన లబ్ధిదారులు మా స్థలాలు మాకు కేటాయించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయంపై ఇటీవల లబ్ధిదారులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు కూడా చేశారు. వెంటనే జగనన్న కాలనీలో వేసిన గుడిసెలను తొలగించాలని స్థానిక రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు గుడిసెలు తొలగించే విషయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు గాని ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉంటే లబ్ధిదారులకు రెండు సెంట్లు చొప్పున సంబంధిత నాయకులు స్థలం కేటాయించడంతో వారు పక్కా ఇళ్లు కూడా నిర్మించుకుంటున్నారు. రోజురోజుకు ఈ అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి.

చర్చనీయాంశంగా అధికారుల తీరు

కనీసం అక్రమ కట్టడాలను ఆపాలన్న ప్రయత్నం కూడా రెవెన్యూ అధికారులు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. పట్టాలు ఉండి ఇళ్లు కట్టుకోవాలన్నా తమ అనుమతి లేనిదే ఇళ్లు నిర్మించకూడదని రెవెన్యూ, బద్వేలు మున్సిపాలిటీ అధికారులు హుకుం జారీ చేశారు. ఇటీవల అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లను కూడా కూల్చివేసిన సంఘటనలు ఉన్నాయి. మరి ఎలాంటి పట్టాలు లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బద్వేలు, గోపవరం రెవెన్యూ పరిధిలో అధిక శాతం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి గుడిసెలు వేసుకోవడం, ఆ తర్వాత పక్కా ఇళ్లు నిర్మించుకోవడం, వాటిని క్రయవిక్రయాలు జరుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ కట్టడాలను నిర్మించే వారిపై కొరడా ఝుళిపించాల్సిన అధికారులు ఆ పని చేయకుండా పట్టాలు ఉన్నా, వివాదాస్పదంగా ఉన్న వారి విషయంలో అటు రెవెన్యూ ఇటు పోలీసు జోక్యం చేసుకుంటున్నారంటే వారికి రెండు పక్కల ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికే కడప - నెల్లూరు సరిహద్దులో కుంట పోరంబోకు, జగనన్న లేఅవుట్లో వందల సంఖ్యలో స్థానికేతరులు గుడిసెలు వేసుకుని ఉన్నారు. రెవెన్యూ అధికారులు ఆదిలోనే స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చేది కాదు. జగనన్న కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులు తమకు స్థలాలు కేటాయిస్తారో లేదో అన్న ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా అక్రమంగా వేసిన గుడిసెలతో పాటు అక్రమ కట్టడాలను కూడా తొలగించి పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉంది.

కమనీయం.. కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్లకు విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు.

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రొద్దుటూరు : చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ సోమవారం 20 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. చేతన ఫౌండేషన్ చైర్మన్ వెనిగల రవికుమార్, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుట్టు మిషన్లు అందించడం జరిగిందన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్కుమార్రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లిబిడ్డ క్షేమం



ఆకులనారాయణపల్లె ఎస్టీకాలనీలో పోషకాలపై వివరిస్తున్న ఐసీడీఎస్ ఇన్చార్జి సీడీపీఓ లక్ష్మీదేవి

కాశినాయన : పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లిబిడ్డ క్షేమంగా ఉంటారని పోరుమామిళ్ల ఐసీడీఎస్ ఇన్చార్జి సీడీపీఓ లక్ష్మీదేవి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆకులనారాయణపల్లె ఎస్టీకాలనీ, వరికుంట్ల, నరసాపురం-1 సాక్షం అంగన్వాడీ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొన్ని అంగన్వాడీ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిధులు విడుదల చేసిందన్నారు. పోరుమామిళ్ల ఐసీడీఎస్ సూపర్వైజర్ రత్నకుమారి, ఆకులనారాయణపల్లె సర్పంచ్ జీ.రాములమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు తులసమ్మ, అమరావతి, ప్రభావతి, వినోదమ్మ, శైలజ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన

కాశినాయన : మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరిపంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. సోమవారం 'వరికి ఎర్ర తెగులు ... రైతు దిగాలు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి వ్యవసాయాధికారులు స్పందించి వరిపంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయికి ఎంపికైన అండర్-14 బాలికల విభాగం క్రీడాకారులు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎస్జీఎఫ్ఐ నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేసినట్లు జెడ్పీ ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, ఎస్జీఎఫ్ఐ క్రీడల నియోజకవర్గ కన్వీనర్ సగిలి బాలయ్య తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో ప్రసన్న, అనుపమ, జ్యోతి, సుప్రజ, గాయత్రి, వినీత, కావ్యలు జిల్లా జట్టుకు ఎంపిక కాగా స్టాండ్బైలుగా త్రిష, బ్లెస్సీ, భవిత ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో కల్పన, కావేరి, అమ్ములు, మౌనిక, అఖిల, స్నేహలతలు జిల్లా జట్టుకు ఎంపిక కాగా స్టాండ్బైలుగా హేమప్రియ, లక్ష్మీనారాయణమ్మ, సరస్వతిలు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో సిద్దు, కిశోర్, సుధీర్, ఓబుల్రెడ్డి, జగన్, జశ్వంత్లు జిల్లా జట్టుకు ఎంపిక కాగా స్టాండ్బైలుగా తేజుద్దీన్, సల్మాన్, మున్నాలు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో వినోద్, మధుమోహన్రెడ్డి, నాగేంద్ర, మహేంద్ర, నాగరాజు, చెంగల్రెడ్డి, మణికంఠలు జిల్లా జట్టుకు ఎంపిక కాగా స్టాండ్బైలుగా నాగచంద్ర, నాగేంద్ర, చందు, సాదిక్లు ఎంపికయ్యారు. ఎంపికైన వారంతా మంగళవారం అన్నమయ్య జిల్లా రామాపురం గురుకుల పాఠశాలలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ఐ కో కన్వీనర్లు నాగేశ్వర్రావు, మహబూబ్బాషా, కొండయ్య, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గల వంటగదుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కోటవీధిలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, పరిసరాలు, భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు.

రేపు మాంసం విక్రయాలు నిషేధం

అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో మాంసం విక్రయాలు నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో చికెన్, మటన్, చేపల దుకాణ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీన జీవహింస చేస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్టీయూఏ సౌత్జోన్ జట్టుకు ఎంపిక



విద్యార్థిని మోక్షితను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : గౌతమి మహిళ ఇంజినీరింగ్ కాలేజీలో తృతీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థిని మోక్షిత జేఎన్టీయూఏ షెటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైంది. కడపలో కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్టీయూఏ అంతర్ కళాశాలల షెటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి సౌత్ జోన్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామసుబ్బమ్మ సోమవారం తెలిపారు. విద్యార్థినిని కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్ నాగూర్, రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాశరావు అభినందించారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి సత్యకుమార్కు వినతి



మంత్రి సత్యకుమార్కు వినతిపత్రం అందచేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు క్రైం : శానిటేషన్ వర్కర్లకు రూ. 28 వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి రాఘవ మంత్రి సత్యకుమార్కు వినతిపత్రం అందచేశారు. 20 ఏళ్లుగా జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు రూ.12,400 వేతనాలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని వారు మంత్రికి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ. 28 వేలు ఇవ్వాలని వారు కోరారు.

ఔట్సోర్సింగ్ సిబ్బంది వినతి

తమ వేతనాలను పెంచాలని జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బంది మంత్రి సత్యకుమార్కు వినతిపత్రం అందచేశారు. చాలీ చాలని జీతాలతో 16 ఏళ్లుగా ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన, పనికితగ్గ వేతనం ఇవ్వాలని కోరారు.

ప్రొద్దుటూరు : దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్కు సోమవారం ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వలంటీర్లుగా పనిచేసిన దివ్యాంగులకు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని కోరారు. 80 శాతం వైకల్యం కలిగి గుండె, బీపీ, షుగర్ లాంటి వ్యాధులతో బాధపడే వారికి రూ.15వేలు పింఛన్ మంజూరు చేయాలని తెలిపారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

మంత్రి హర్షం

సొంత గడ్డపై ప్రజలు చూపిన అభిమానం పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్కు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్రెడ్డి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈహెచ్ఎస్ కార్డులు అన్ని కార్పొరేట్, సూపర్స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని ఆయన కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్రెడ్డి, అప్సర్ బాషా, కృష్ణారెడ్డి, గురివిరెడ్డి, నరసింహకుమార్, నారాయణరెడ్డి అమీన్ పాల్గొన్నారు.

చీనీ తోటలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్త

మైదుకూరు : మండలంలోని వనిపెంట కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ సోమవారం పులివెందుల మండలంలోని చీనీతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చీనీ తోటల్లో వేరుకుళ్లు తెగులు, మంగు, పొలుసుల తెగుళ్లను గుర్తించి వాటి నివారణ మార్గాలను రైతులకు సూచించారు. వేరుకుళ్లు నివారణకు ట్రైకోడర్మా జీవశిలీంద్రాన్ని పశువుల పేడతో కలిపి బెల్లపు నీటితో మిశ్రమాన్ని తడుపుతూ పది రోజుల నిల్వ ఉంచి చెట్టు మొదళ్ల నుంచి కొంచం దూరంలో వేసుకోవాలని తెలిపారు. మంగు, పొలుసు తెగుళ్లకు వివిధ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సూచించారు.

బహిరంగసభను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలో మంగళవారం నిర్వహించనున్న భూ బాధితుల జిల్లాస్థాయి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండల పరిధిలో బైక్ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఇమ్మానుయేల్ మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంతో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన భూ కబ్జాలపై విచారణ జరపడంతో పాటు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు హరికృష్ణ, సుధాకర్, రాజశేఖర్, సుబ్బారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు

ఖాజీపేట : పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే పదవులతో మంచి గుర్తింపు వస్తుందని మంత్రి సత్యకుమార్ అన్నారు. సోమవారం ఖాజీపేటలోని భీరం శ్రీధర్ రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ను ఆయన సందర్శించారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భీరం సుబ్బారెడ్డిని మంత్రి ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం బాధ్యతగా పనిచేసినప్పుడే సమాజంలో గౌరవ ప్రతిష్టలు లభిస్తాయన్నారు. భీరం విద్యాసంస్థల చైర్మన్ సరస్వతి, డైరెక్టర్ స్వాతి, శ్రీకాంత్రెడ్డి పాల్గొన్నారు.

కసువు సేకరణ డబ్బును ప్రభుత్వమే చెల్లించాలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు : ఇంటింటా కసువు సేకరణ కోసం వచ్చే ఆటోలకు ప్రతి నెల మున్సిపాలిటీ నుంచి రూ.30లక్షలు చెల్లించాల్సి ఉందని, ఈ డబ్బు చెల్లిస్తే మున్సిపాలిటీలో అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడుతుందని, ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితో పాటు పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అజెండాలోని అంశంపై మాట్లాడుతూ ఇంటింటా కసువు సేకరణకు వచ్చే ఆటోలకుగాను గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు రెడ్డి ఎంటర్ప్రైజెస్ సంస్థకు రూ.5,61,20,553 చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ విషయంపై బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి కసువు సేకరణ చేసి ప్రజల నుంచి నెలకు రూ.30, రూ.60 ప్రకారం డబ్బు వసూలు చేసేవారన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా చంద్రబాబు నాయుడు ఈ డబ్బును ప్రజలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ మొత్తాన్ని మున్సిపాలిటీ చెల్లిస్తోందని, ఇందుకు సంబంధించిన ఆటోలకు నెలకు రూ.30లక్షల ప్రకారం భారం పడుతోందన్నారు. మున్సిపల్ వార్షిక బడ్జెట్ ఏడాదికి రూ.16 కోట్లు మాత్రమే ఉందన్నారు.

రోడ్ల మరమ్మతులు ఎందుకు చేపట్టలేదు

గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కూరగాయల మార్కెట్ నిర్మాణం, బ్రిడ్జి నిర్మాణం, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడంతో మున్సిపాలిటీపై భారం పడలేదన్నారు. ఈ తరహాలోనే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కసువు సేకరణకు సంబంధించిన డబ్బును చెల్లించాలని కోరారు. 2011 నుంచి ఇప్పటి వరకు మున్సిపాలిటీకి బకాయి ఉన్న రూ.కోటి ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేయాలని కౌన్సిలర్ మురళీధర్రెడ్డి డిమాండ్ చేశారు.నెలల క్రితం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చెప్పినా ఇంత వరకు రోడ్ల మరమ్మతులను ఎందుకు చేపట్టలేదని సభ్యులు ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు జెడ్పీ హైస్కూల్కు చెందిన నలుగురు విద్యార్థులు ఎస్జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జూటూరు సురేష్బాబు, ఫిజికల్ డైరెక్టర్ షేక్ అల్లాబకష్ తెలిపారు. వి.ధనుష్ (10వ తరగతి), పి.ఉదయ్ కిరణ్, కె.గురునాని, ఎస్.భవిత (9వ తరగతి) విద్యార్థులు అక్టోబర్ నెలలో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. అలాగే ఎస్జీఎఫ్ఐ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు 13 మంది, కబడ్డీ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. ఈ విద్యార్థులను సోమవారం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు, పీడీతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చాపాడు: ఇటీవల ప్రొద్దుటూరులోని జార్జ్ కారోనేషన్ క్లబ్లో జరిగిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలలో మండలంలోని అయ్యవారిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ తెలిపారు. అయ్యవారిపల్లె హైస్కూల్కు చెందిన బి.కిరణ్, మునాఫ్, నాగ చరణ్, మనస్విని లు జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలలో ప్రతిభ చాటరని, త్వరలో నంద్యాలలో జరుగనున్న రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలియజేశారు.

సాక్షం అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్వైజర్

చాపాడు: మండల పరిధిలోని ఖాదర్పల్లె-1, చాపాడు-1, చియ్యపాడు-1, 2 అంగన్వాడీ కేంద్రాలను అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన సాక్షం కేంద్రాలుగా ప్రారంభించినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ తెలిపారు. మండలంలోని చియ్యపాడు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ సాక్షం అంగన్వాడీ కేంద్రాల్లో ఎల్ఈడీ టీవీలు, శుద్దనీటి యంత్రం, వర్షం నీరు నిలువ చేసే తొట్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. గత వారం రోజులుగా వివిధ రకాల పోటీలను నిర్వహించామన్నారు. ముగ్గుల పోటీలు డ్రాయింగ్, ఫ్యాషన్ షో, తల్లిదండ్రులతో సమావేశం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల పని తీరుపై తల్లిదండ్రులకు వివరించారు. ఐటీసీ పద్మ, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ స్వరూప, అంగన్వాడీ వర్కర్లు సరస్వతి, నాగమణి, రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్లో ధరలు నియంత్రించాలి

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించే ఎగ్జిబిషన్లో ధరలను నియంత్రించాలని పీఎస్వైఎఫ్, ఆర్ఎస్ఓ నాయకులు ఓబులేసు, జగన్, లింగమయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు వారు తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గత ఏడాది మాదిరి ఎగ్జిబిషన్ ఎంట్రన్స్ ఉచితంగా కల్పించాలని కోరారు. ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్ మున్సిపాలిటీ నిర్ణయించిన ధరలను మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే టెండర్ రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నడపాలన్నారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, చిన్న పిల్లల హాస్టల్ ఉన్నందున విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఎగ్జిబిషన్ను 45 రోజులు కాకుండా కుదించాలని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

చాపాడు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం వద్ద సోమవారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో అక్షం, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాలలో భాగంగా పారిశుధ్యం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ రకాలైన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ర్యాలీ ద్వారా ప్రజలు అవగాహన కల్పించామన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

9వ వర్ధంతి
(01.10.2024)



1941-2015
కీ॥శే॥ తిప్పలూరు నారాయణస్వామి
వ్యవస్థాపక అధ్యక్షులు : గౌతమ్ విద్యాసంస్థలు, ప్రొద్దుటూరు.

భార్య : టి.మునిలక్ష్మమ్మ, కుటుంబ సభ్యులు మరియు
గౌతమ్ విద్యాసంస్థల కుటుంబం, ప్రొద్దుటూరు.